www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 సెప్టెంబరు 2024



'నులిపురుగుల నిర్మూలన'ను విజయవంతం చేయండి: కలెక్టర్


ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుండి నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్య క్రమాన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి విజయ వంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నులిపురుగుల దినోత్సవానికి సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వ హించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల17వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1-19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసేలా వైద్య ఆరోగ్య శాఖ విద్యాశాఖ, ఐసిడిఎస్ సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం రోజున ఏదైనా కారణం వల్ల డీ వార్మింగ్ చేయబడని పిల్లలకు మళ్లీ ఈ నెల 25వ తేదీ అల్బెండ జోల్ మాత్రలను మింగించేందుకు చర్యలు తీసు కోవాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చేతు లు పరిశుభ్రంగా ఉంచు కోవడం, పరిశుభ్రతను పాటించడం ద్వారా నులి పురుగుల బారిన పడకుండా నివారించవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1-19 సంవత్సరాల లోపు వున్న పిల్లలకు కడుపులో నులి పురుగులు నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండ జోల్ మాత్రలు సంబంధిత విద్యా సంస్థ లకు అందించడం జరిగిందన్నారు. ప్రతి అధికారి బాధ్యతతో నిర్వహించి ప్రతి 1-19 సంవత్సరాల వయస్సు వారికి మధ్యాహ్నం భోజనం తర్వాత అల్బెండజోల్ మాత్రను మింగించాలన్నారు. జిల్లాలో మొత్తం 5,466 పాఠశాలలో 3,63,888 మంది విద్యార్థులకు మాత్రలు వేస్తామని తెలిపారు. 2,883 ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 2లక్షల36వేల691 మంది విద్యార్థులు,163 ప్రభుత్వ ప్రైవేటు ఇంటర్మీడియట్ విద్యార్థులు 43 వేల787 మంది వున్నారన్నారు. బడి బయట పిల్లలు (10-19) సంవత్సరాల లోపు 4వేల486 మంది ఉన్నారన్నారు. 2 వేల420 అంగన్ వాడీ కేంద్రా లలో 78 వేల924 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధి కారులు, మండల విద్యాశాఖ అధికారులు, సిడిపిఓలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. 17 వ తేదీ వంద శాతం పూర్తి చేయాలని, ఏదైనా కారణం వల్ల డీ వార్మింగ్ చేయని పిల్లలకు మళ్లీ ఈ నెల 25 వ తేదీ మాత్రలు ఇప్పించా లన్నారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత శాఖల జిల్లా అధికారులు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన భావి పౌరులను దేశానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల న్నారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా ఇన్ ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, సంబంధిత శాఖల అధికారు లు పాల్గొన్నారు.

బేలుపల్లిలో అతిసార

- ఒకరి మృతి, 15 మందికి అస్వస్థత
- నీటి కాలుష్యమే కారణమని గుర్తింపు
- పారిశుధ్య పనుల పరిశీలన
- బాధితుల పరిస్థితిపై ఎమ్మెల్యే ఆరా
- తక్షణ చర్యలు చేపట్టాలని డిపివోకు ఆదేశం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి పంచాయతీ కేంద్రంలో గ్రామంలో రెండేళ్లుగా వాడకంలో లేని సింటెక్స్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీటి వినియోగం కారణంగా అతిసారా ప్రబలి ఆదివారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. 15 మంది అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలిసిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వెంటనే ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అతిసారకు కారణాలను తెలుసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందించాలని సూచించారు.

బేలుపల్లి పంచాయతీ కేంద్రం గ్రామ సరిహద్దుల్లోని చెరువులు కలుషితం కావడం, ట్యాంకులను శుభ్రపరచకపోవడం, కొంతమంది గ్రామ సమీపంలో వందలాది జీవాలను మేపుతుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో నీటిని తాగిన గ్రామానికి చెందిన మునెమ్మ(60) అతిసార సోకి ఆదివారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన 15 మంది అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తక్షణం స్పందించారు. మండల టిడిపి నాయకులతో కలిసి ఆయన బేలుపల్లి గ్రామానికి చేరుకున్నారు. అతిసారా సోకి చికిత్స పొందుతున్న బాధితులను కలిసి పరామర్శించారు. బాధితుల పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అతి సారతో మృతి చెందిన మునెమ్మ భౌతికకాయానికి నివాళ లర్పించి వారి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం గ్రామంలోని ప్రతి వీధిలో పారిశు ధ్యం, డ్రైనేజ్,పైప్ లైన్ లను పరిశీలించిన ఆయన అతిసారకు గల కారణాలపై గ్రామస్తులు, అధికారులతో చర్చించారు. గ్రామంలో రెండేళ్లుగా వాడకంలో లేని సింటెక్స్ ట్యాంక్ లో నిల్వ ఉన్న నీటి వాడకం కారణంగానే అతిసార ప్రబలిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. గ్రామ సరిహద్దుల్లోని చెరువులు కలుషితం కావడం, ట్యాంకులను శుభ్రపరచకపోవడం, కొంతమంది గ్రామ సమీపంలో వందలాది జీవాలను మేపుతుండడం కూడా అతిసార సోకడానికి కారణమని గుర్తించిన ఆయన వెంటనే పారిశుధ్య పనులతో పాటు పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ లక్ష్మి, ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లోకనాథం, పంచాయతీ కార్యదర్శి బాలాజీలతో పాటు మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి పాల్గొన్నారు.



బేలుపల్లి ప్రజలను అతిసారకు గల కారణాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక సైన్స్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, రామచంద్రాపురం: ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక సైన్స్ దాగి ఉందని, సూర్యరశ్మి, గాలి, నీరు, మొక్కలు, సూక్ష్మజీవులు, మట్టి తదితర అన్ని అంశాలు ప్రకృతి వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి. విజయ్ కుమార్ స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే గాకుండా ప్రజల ఆరోగ్యం, భూమి పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఓ పరిపూర్ణ విధానంతో ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ) కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రైతు సాధికారసంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు ఈనెల 15 నుంచి 17వ తేది వరకు మెక్సికో దేశ ప్రతినిధి బృందం తిరుపతి జిల్లాలో పర్యటిస్తోంది. అందులో భాగంగా ఆదివారం తిరుపతి పట్టణం లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఏపీ సీఎన్ఎఫ్‌తో పాటు ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమి ఫర్ ఆగ్రో ఎకాలజి రిసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్, ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను మెక్సికో ప్రతినిధి బృందానికి వివరించారు. ఈ బృందంలో మెక్సికో ప్రభుత్వ ప్రతినిధి బృందంతో పాటు ప్రజా సంస్థల తరపున పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు కూడా ఉన్నారు. మెక్సికో ప్రభుత్వం తరపున ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ నేతృత్వంలో ఆ దేశ కేంద్ర కార్యాలయం నుంచి కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రామిరేజ్ పార్డో ఎరికా సోమి, మెక్సికన్ నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులులో పెజ్ మెర్లిన్ డేవిడ్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మార్కెటింగ్ కంపెనీస్ ఆఫ్ రూరల్ ప్రొడ్యూసర్స్ సంస్థ సాంకేతిక నిపుణులు ఇసైయాస్ సోలాజానో మంజానో, శ్రీ ఫ్రాగోసో విల్లావిసెన్సియో పాబ్లో ఈ బృందంలో ఉన్నారు. వీరితో పాటు అంతర్జాతీయ దాతృత్వ సంస్థ నౌ పార్టనర్స్ నుంచి లియోనార్డో సిల్వా డి ఆండ్రేడ్, రెన్స్కే వాన్ గ్రిన్స్వెన్‌లు పాల్గొన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తరించి రాష్ట్రాన్ని రసాయన రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి ఎంతో చిత్తశుద్ధి కలిగి ఉన్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం వల్ల రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరగడమే గాకుండా అనేక ఆర్థికేతర ప్రయోజనాలుకలుగుతున్నాయని అన్నారు. వతావరణ ఎమర్జెన్సీకి ప్రకృతి వ్యవసాయం ఓ పరిష్కార మార్గంగా ఉద్భవించిందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే అనేక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాన్ని శరవేగంగా విస్తరించే ప్రయత్నం చేస్తున్నామని, రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం వల్ల కార్యక్రమం విస్తరణ సులభతరం అవుతోందన్నారు. ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ అధికారులు సి.చంద్రశేఖర్, కే.సురేష్ బాబు, లక్ష్మానాయక్, సుధాకర్, డాక్టర్ సందీప్,



మెక్సికో బృందం పర్యటన

ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఫార్మర్ సైంటిస్టులు, పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శన...

మెక్సికో బృందం ఆదివారం మధ్యాహ్నం తిరుపతి గ్రామీణ పరిధిలోని వేమూరు గ్రామంలో డి.అయ్యప్ప నాయుడు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన డెమో పద్ధతిలో పాల్గొని ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన గుళికల తయారి విధానంను ప్రత్యక్షంగా తెలుసుకొన్నారు. అనంతరం సి.రామాపురం గ్రామంలో పర్యటించి వేర్వేరు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఏడాది పొడవునా పెరటి తోటలను నిర్వహించే నిరుపేద కుటుంబాలతో చర్చించారు. అనంతరం అదే గ్రామంలో మహిళా సంఘాలు, గ్రామ ఐక్య సంఘాల ప్రతినిధులతో ముచ్చటించి మహిళా సంఘాల బాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్న తీరును, మహిళల పాత్రను అడిగి తెలుసుకొన్నారు.

అద్భుతాల ఘనత విశ్వేశ్వరయ్యదే..

- ఆర్అండ్‌బి డీఈ దస్తగిరి



మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఇంజనీర్లు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే నిర్మాణ రంగం లో అద్భుతాలను సాధిం చిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వ రయ్య దని ఆర్అండ్‌బి డిఈ దస్తగిరి అన్నారు. ఆదివారం ఉదయం చిత్తూరు నగరం లోని ఆర్ అండ్‌బి అతిథి గృహ ఆవరణలో ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను, ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. చిత్తూరు ఆర్కిటెక్ట్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్లు విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్అండ్‌బి డీఈ దస్తగిరి విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే నిర్మాణ రంగంలో అద్భుతాలను సాధించిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వరయ్యకే దక్కుతుందన్నారు. ఆయన 1861 లో కర్ణాటక రాష్ట్రం, మైసూర్ లో జన్మించి ఇంజనీర్ వృత్తి చేపట్టారన్నారు. నిజాం నవాబుల పాలన రోజుల్లో హైదరాబాదు మూసీ నదికి వరదలు వచ్చిన సమయంలో, నిజాం నవాబు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహాను తీసుకొని డ్యామ్ ను నిర్మించారన్నారు. అదే రీతిలో కావేరి జలాల సమస్య వచ్చినప్పుడు సైతం కృష్ణా బ్యారేజ్ నిర్మించింది కూడా ఆయనే అన్నారు. తిరుమలకు ఘాట్ రోడ్డు నిర్మించి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వ్యక్తిగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య గుర్తింపు పొందారన్నారు. నేటి ఇంజనీర్లు ఆయనను ఆదర్శంగా తీసుకొని మరింత నిర్మాణాత్మకమైన ప్రాజెక్టులను నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూజలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు, చిత్తూరు ఆర్కిటెక్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే జయప్రకాష్, కార్యదర్శి ఎల్ విజయకుమార్, కోశాధికారి కే గుణశేఖర్, సభ్యులు ఎన్ జ్యోతిశ్వరన్, సురేంద్రరెడ్డి, టి కేదార్ నాథ్, టీ బాలాజీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు, బంగారుపాళ్యం: బస్సు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి చెందినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మొగిలి ఘాట్‌లో బస్సు, లారీలు ఢీకొన్న సంఘటనలో గంగాధర నెల్లూరు మండలం పాపి రెడ్డి పల్లికి చెందిన భాస్కర్ రెడ్డి భార్య పద్మావతి (54) బెంగళూరుకు వెళుతుండగా ప్రమాదంలో గాయపడింది. ఆమెను పలమనేరులో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం చిత్తూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాణిపేట సిఎంసి ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా ఆదివారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



పద్మావతి (ఫైల్ ఫొటో)

వరసిద్ధునికి పట్టువస్త్రాల సమర్పణ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం టిటిడి తరపున ఈవో జె.శ్యామల రావు పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏడాదీ బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి ఈవోకు ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవో విద్యాసాగర్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ప్రదక్షిణం చేసి గర్భాలయంలో స్వామివారికి వస్త్రసమర్పణ చేశారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ఈ సందర్భంగా టీటీడీ ఈఓ ను కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

- అందని ప్రభుత్వ వైద్యం
- భయాందోళనలో చిన్నారులు, ప్రజలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న దాసర్లపల్లి గ్రామంలో సుమారు పది రోజులుగా గ్రామంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జ్వరాలు బారిన పడి ఆందోళన చెందుతున్నారు. తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల దాసర్లపల్లి గ్రామంలో ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్ల వద్ద చికిత్స తీసుకుంటున్నారు. మెరుగైన చికిత్స లేకపోవడం వల్ల ఫలితంగా జ్వరాలు అదుపులోకి రాలేదని, పిల్లలకు జ్వరాలు ఎక్కువ అవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వర పరీక్ష చేయించడానికి వీలు కాలేదని విధి లేని పరిస్థితుల్లో గ్రామానికి వెనుదిరిగి తిరిగి వెళ్లారు. దీనిపై డాక్టర్ అరుణ కుమారిని వివరణ కోరగా ఈ విషయం మీరు తెలిపితే గాని తమకు తెలియడంలేదని, త్వరలో పరిశీలించి గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించి ఇంటింటికి సర్వే నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

సామాజిక దృక్పథంతో వ్యవహరించాలి

ద్విచక్ర వాహన మెకానిక్ సంఘం వార్షికోత్సవంలో ట్రాఫిక్ సిఐ



సమావేశంలో మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహన మెకానిక్‌లు సామాజిక దృక్పథంతో వ్యవహరించాలని చిత్తూరు ట్రాఫిక్ సిఐ నిత్యబాబు సూచించారు. చిత్తూరు లోని అంబేద్కర్ భవన్ లో చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ సంఘం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి, జిజేయం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవనాయుడు, ట్రాఫిక్ సిఐ నిత్యబాబు, చిత్తూరు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ నెట్టికంటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు స్కూటర్ మెకానిక్స్ సంక్షేమంపై ప్రసంగించారు. చిత్తూరు ట్రాఫిక్ సిఐ నిత్యబాబుద్విచక్ర వాహన మెకానిక్‌లు సామాజిక దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహన మెకానిక్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాయనేని ధర్మారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పది లక్షల మందికి పైగా ద్విచక్ర వాహన మెకానిక్‌లు ఉన్నారని, వారికి ఇప్పటి వరకు సరైన గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో తమను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తిస్తే పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు అర్హులమవుతామని పేర్కొన్నారు. తమకూ ప్రమాద బీమా, ఈఎస్ఐ వర్తింపజేయడం, గుర్తింపు కార్డులు మంజూరు, ఆయా జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తమ అసోసియేషన్లకు స్థలంతో పాటు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు, బిఎస్ - 6 ద్విచక్ర వాహనాల మరమ్మతులపై స్కిల్ ట్రైనింగ్ ఇప్పించడం, తదితర న్యాయపరమైన అంశాలను పరిశీలించి అమలు చేసి తమను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. సంఘం చిత్తూరు నగర అధ్యక్షులు మురుగేష్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో తమ సంఘ భవనం నిర్మాణం కోసం సరిపడా 10 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని, ఇదివరకే స్థలం మంజూరు విషయం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిశామని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. తమ మెకానిక్‌ల సంక్షేమ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు అందరితోనూ సత్సబంధాలు కొనసాగిస్తామని మురుగేష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఇస్మాయిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి లక్ష్మణరావు, చిత్తూరు నగర కార్యదర్శి బాలచంద్ర, సంయుక్త కార్యదర్శి ఎస్కే మస్తాన్, గౌరవాధ్యక్షులు ఎన్ మురుగ, నగర కోశాధికారి షణ్ముగరెడ్డి, నగర సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులు మహమ్మద్ రఫీ, మనోహర్ రెడ్డి, సూరి, యువరాజ్, బంగారుపాళ్యం సంఘం గౌరవాధ్యక్షులు ఎస్ పురుషోత్తమ నాయుడు, ఈసీ సభ్యులు జాకీర్ బాష, చిట్టిబాబుతో పాటు దాదాపు వెయ్యి మందికి పైగా ద్విచక్ర వాహన మెకానిక్‌లు పాల్గొన్నారు.

22న క్రీడల్లో ఉపాధ్యాయులు పాల్గొనాలి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఉపాధ్యాయినిఉపాధ్యాయులు ఈనెల 22వ తేదీ క్రీడల్లో పాల్గొనాలని జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి సరిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తూరు డివిజన్‌లో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సంబరాలలో భాగంగా ఈనెల 22వ తేదీ ఆదివారం క్రీడోత్సవాలు చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. చిత్తూరు డివిజన్‌లోని మండలాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో పాల్గొనాలని ఈ క్రీడోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజన్ బాధ్యులు దీనికి తగిన ఏర్పాట్లను నిర్వహించాలన్నారు.

ప్రపంచానికే ఆదర్శం భారత రాజ్యాంగం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆధునిక సమాజానికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ప్రపంచ మేధావిగా, దళితుల ఆశా జ్యోతిగా పేరుపొందిన ఆ మహనీయునికి మనం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయడమే ఆయనకు మనం అందించే ఘనమైన నివాళి అన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం సుబ్రహ్మణ్యం నేతృత్వంలో పెనుమూరు మండలం, కలవకుంట పంచాయతీ, ఎగువపూనేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు , రిటైర్డ్ డిజిపి సునీల్ కుమార్ , విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప , జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ , పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, రిటైర్డ్ ఎస్పి చిన్న స్వామి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ఆధునిక మానవ మనుగడకు అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ఓ దిక్సూచి అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆ మహనీయుడు చేసిన పోరాటం నిరుపమానమన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు అన్ని రకాల అభివృద్ధి చెందేందుకు అవకాశం లభించిందన్నారు. అంబేద్కర్ ద్వారా లభించిన రిజర్వేషన్ల వల్లే ఆయన వారసులుగా తాము కూడా రాజకీయ రంగంలో రాణించేందుకు అవకాశం లభించిందన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికై చట్టసభల్లో అడుగుపెట్టి ప్రజాసేవ చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే చిత్తూరు చిత్తూరు ఎంపిగా తన నియోజక వర్గాన్ని ప్రగతి పథంలో నడిపించడమే ధ్యేయంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని తెలిపారు. ఈ క్రమంలోనే ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి చిత్తూరు పార్లమెంటు పరిధిలో చేపట్ట బోయే సంస్కరణలకు సంబంధించి, వినతి పత్రాలను సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే పాకాల రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో కొత్త రైల్వే కోచ్ డిపో నిర్మాణానికి బీజం పడినట్లు తెలిపారు. చిత్తూరు పార్లమెంటులోని ఏడు నియోజకవర్గాల శాసనసభ్యుల సహకారంతో చిత్తూరు పార్లమెంటు పురోభివృద్ధికి పాటుపడుతున్నానన్నారు. తన సెగ్మెంటులో నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎంఎస్ఎంఈలు మార్గం చూపుతాయని ప్రసాదరావు వెల్లడించారు. అంబేద్కర్ చూపిన బాటలో నడిచి దళితుల శ్రేయస్సుకోసం తన వంతు కృషి చేస్తానని చిత్తూరు ఎంపి తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చిత్తూరు ఎంపి ప్రసాదరావు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణారెడ్డి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యాప్రమాణాల పెంపు లక్ష్యంగా సమగ్రశిక్ష అభియాన్ పని చేస్తోందని జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

ప్రజాశక్తి: సమగ్రశిక్షా అభియాన్ లక్ష్యం ఏమిటి?

పీడీ: సమగ్రశిక్షా అభియాన్‌ను ఏర్పాటు చేయడంలో ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, యూనిఫాం ఇతర సామగ్రి సరఫరా చేయడంతో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయడమే లక్ష్యం.

ప్రజాశక్తి: 'మనబడి మన భవిష్యత్' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పించారు?

పీడీ: 'మనబడి మన భవిషత్తు' ద్వారా నిరంతరం నీటి సరఫరాతో మరుగుదొడ్ల, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు, శుద్ధి తాగునీరు, తరగతి గదుల్లో ఫర్నీచర్ ఏర్పాటు, తరగతి గదులు ప్రహరీ గోడకు రంగులు, పెద్ద, చిన్న మరమ్మతులు, ల్యాబ్‌లు ఏర్పాటు, ప్రహరీ గోడల నిర్మాణం, వంట గదులు నిర్మాణం, రిపేర్లు, అంగన్‌వాడీ కేంద్రాల రిపేర్లు, ఆట వస్తువుల కొనుగోలు వంటి వసతులు కల్పిస్తాం..

ప్రజాశక్తి: సమగ్రశిక్షా అభియాన్ ద్వారా పాఠశాల అభివృద్ధికి ఎంత ఖర్చు చేశారు?

పీడీ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 743 పాఠశాలల్లో . సుమారు రూ.182.45 కోట్లు అంచనాతో పనులు చేపట్టాం.. ఇప్పటి వరకు రూ.169.93 కోట్లు ఖర్చుచేసి మౌలిక వసతులు కల్పించాం.. రెండవ విడతలో కొత్త చిత్తూరు జిల్లాలో 1,209 పాఠశాలలలో రూ.448.06 కోట్ల అంచనాతో పనులు చేపట్టాం.. పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.236.65 కోట్లు ఖర్చు చేశాం..

ప్రజాశక్తి: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా ఎన్ని కిట్లు పంపిణీ చేశారు?

పీడీ: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లోని 1,50,120 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశాం..స్టూడెంట్ కిట్స్‌లో బ్యాగ్, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, మూడు జత యూనిఫాం క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఫిక్టోరియా డిక్షనరీ, అక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్, తెలుగు డిక్షనరీలు వుంటాయి.



భూ సమస్యలు పరిష్కరిస్తాం: టిడిపి



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : దేవరాజపురం గ్రామంలోని భూ సమస్యలను కుప్పం నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పి ఎస్ మునిరత్నం, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, కుప్పం నియోజక వర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబుల దృష్టికి తీసుకెళ్లి కలెక్టర్, కడా పీడీల సహకారంతో పరిష్కరిస్తామని కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన పలువురు టిడిపి నాయకులతో కలిసి దేవరాజపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దళిత వాడల అభివృద్ధికి, దళిత కులస్థుల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. అలాగే రైతుల అభ్యున్నతికి, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకువచ్చిన పతకాలను ఉపయోగించుకొని, దళిత సభ్యులు ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కందస్వామి, అంబేద్కర్, అన్నాదొరై, మూర్తి, ఆర్ముగం, గంగప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న ఇంజినీర్లు

ఘనంగా ఇంజనీర్స్ డే


ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే ఆదివారం ఘనం గా నిర్వహిం చారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిసిఎన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను గుర్తించి ఆయన జన్మదినాన్ని ఇంజనీర్స్ డే గా జరుపుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. నేటితరం ఇంజనీర్లు ఆయనను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని సూచించారు.



పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి - గంగవరం: గంగవరం మండలంలోని డ్రైవర్స్ కాలనీ సమీపంలో చెన్నై- బెంగళూరు రహ దారిపై నూతనంగా ఏర్పా టైన వినాయక పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. వ్యాపారం లో నమ్మకం ఎంతో ముఖ్య మైందని వినియోగ దారులకు మంచి నమ్మకం కలిగించినపుడే వ్యాపారం వృద్ధి చెందుతుందని, లాభార్జనే ధ్యేయంగా కాకుండా మంచిపేరును తెచ్చుకునేలా వ్యాపారాన్ని కొనసాగించాలని నిర్వాహకులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ యాజమాన్యం సిబ్బందితో పాటు గంగవరం మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మొగిలి ఘాట్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీకి చెందిన జంగాలపల్లి నివాసి శంకర్ రెడ్డి మరణించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శంకర్ రెడ్డి కుటుంబానికి 5 లక్షల చెక్కును అందించారు. వీరి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి తో పాటు టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాహలంగా సలాపూరెమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీ పల్లికుప్పం గ్రామంలో వెలసిన సలాపూరెమ్మ ఆలయంలో రెండు రోజులుగా ఉత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టి అన్నదానం చేశారు. ఆదివారం డప్పులు వాయిస్తూ, మేళతాళాలు మధ్య అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్ళు పెట్టారు. రాత్రి బాణాసంచా వేడుకల మధ్య అమ్మవారి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు.

వేడుకగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి- వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు దళితవాడలలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం వినాయక విగ్రహం నిమజ్జనం ఆ గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు.

కార్వేటినగరం: వినాయ చవితి వేడుకల్లో భాగంగా 9వ రోజు ఆదివారం నిమజ్జనాన్ని యువత కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ కార్వేటినగరం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలకు పూజలు నిర్వహించి, ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి రంగులు చల్లుకుంటూ, డీజే పాటలకు స్టెప్పులు వేస్తూ కోలాహలంగా కనిపించారు. గాండ్లమిట్ట కూడలి, శివాలయం వీధి. తూర్పువీధి. చిన్ననగర్ విధి, బీసీ కాలనీ, కార్వేటినగరం పెద్ద దళితవాడ, చిన్న దళితవాడల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

పలువురు డీఎస్పీలు బదిలీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తరంలో జారీ చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లాలో సైతం పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్పి ఎం.రాజగోపాల్ రెడ్డిని తిరపతి పోలీస్ ట్రైనింగ్ సెంటర్(పిటీసి) డీఎస్పీగా బదిలీ చేశారు. ఏసీబీ డీఎస్పీ వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, సిఐడి డీఎస్పీ ఎనుగంటి శ్రీనివాసరావును రేణిగుంట ఎస్‌డిపిఓగా, పల్నాడు ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్పీగా పని చేస్తున్న బి.ప్రసాదును చంద్రగిరి ఎస్‌డిపిఓగా బదిలీ చేస్తూ ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో వారు ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

లోక్ అదాలత్‌లో143 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- పలమనేరు: జాతీయ లోక్ అదాలత్ లో143 కేసులు పరిష్కారం అయ్యాయని పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్జిలు శ్రీనివాసరావు. లిఖిత. రాధమ్మలు మాట్లాడుతూ భార్యాభర్తల గొడవల కేసులు, సివిల్ దావా కేసులతో పాటు ఇతర కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఇందులో ఇరు పార్టీల కక్షిదారులు గెలుపొంది నట్టేనన్నారు. అతి తక్కువ ఖర్చుతో కేసులు పరిష్కారం జరుగుతుందన్నారు. రాజీ మార్గమే రాచ మార్గం అన్నారు. గతంలో తరతరాలుగా కోర్టులలో పెండింగ్‌లో కేసులు ఉండే వన్నారు. దీంతో కక్షిదారులు పూర్తిగా నష్టపోయారన్నారు. అందుకే 1987లో ప్రత్యేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక యాక్టను ప్రవేశపెట్టి కక్షిదారులకు ఏర్పాటు చేశారన్నారు. ఇరు పార్టీల కక్షిదారులు గ్రామాలలో కూర్చొని మాట్లాడుకుంటే వారి సమస్యలు వెంటనే పరిష్కారం అవుతుందన్నారు. కాగా జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జ్‌మెంట్ అయితే అటు తర్వాత అపీల్ కు ఇతర కోర్టులకు వెళ్లే అవకాశం కూడా వుండదన్నారు. ప్రతి ఒక్క కేసు త్వరత గతిన పరిష్కారం కావాలంటే లోక్ అదాలత్ ను కక్షిదారులు ఆశ్రయించాలన్నారు. బ్యాంకులకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షి దారులు సమన్వయం పాటించి వారికి చెందిన కేసులను ఆవేశానికి గురికాకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 143 కేసులకు సంబంధించి 97 లక్షల 7 వేల 949 రూపాయలు కక్షిదారుల ద్వారా రాబట్టారు. ఇందులో సీనియర్ న్యాయవాదులు లక్ష్మీపతి, పరమశివప్ప ఎల్ భాస్కర్, ఏపిపి రంజిత్ షాలతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ సందర్భంగా మాట్లాడుతున్న జడ్జి

సమాజ సేవే ధ్యేయం

ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు ప్రారంభోత్సవంలో చైర్మన్ గంగరాజులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ సేవ చేయాలన్న ధ్యేయంతోనే ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు ఆవిర్భవించిందని ఆ బ్యాంక్ ఛైర్మన్ తలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ఆదివారం చిత్తూరు నగరంలో 53వ బ్రాంచ్ ను సిటిజన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ రంగరాజులు ప్రారంభించారు. అనంతరం జరిగిన బ్రాంచ్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల జీవనస్థితి గతులను మెరుగుపరచాలన్న సంకల్పంతో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన బ్యాంకు సేవలు సామాన్య ప్రజలకు బ్యాంకు పరంగా చేయూతనివ్వాలని ఉద్దేశంతో చిత్తూరులో 53వ బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 1916 సంవత్సరంలో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమై అంచలంచెలుగా విస్తరించి దేశంలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల మినహా సహకార టౌన్ బ్యాంకుల్లో అతిపెద్ద సహకార అర్బన్ బ్యాంకుగా గుర్తింపు పొందిందన్నారు. షేర్ ధనంలో మూడో స్థానంలో, డిపాజిట్లలో 15 స్థానం, రుణాల్లో 14 స్థానంలోఈ బ్యాంకు నిలిచిందని, నికర లాభంలో దేశంలోనే 10వ స్థానంలో వుందని తెలిపారు. గత ఏడాది 25 కోట్లు లాభాలు రాగా 39 కోట్లు సభ్యులకు డివిడెంట్ రూపంలో అందించమన్నారు. పలు ప్రోత్సాహాలను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో చిత్తూరు నగరంలో కొత్తగా బ్రాంచ్ ను ప్రారంభించామని తెలిపారు. ఈ బ్రాంచ్ సేవలను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న మూడేళ్లలో చిత్తూరు బ్రాంచ్ ద్వారా రూ.100 కోట్లు రుణాలు ఇవ్వా లని అదే లక్ష్యం గా పెట్టుకు న్నట్లు చెప్పారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ ఛైర్మన్ ఆంజనేయులు మాట్లా డుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ బ్యాంకు పట్ల ప్రజల విశ్వాసం కలిగి ఉన్నారని , లాభాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం ఈ బ్యాంకును ఏర్పాటు చేశారన్నారు. లాభాల లక్ష్యంగా బ్యాంకులు పనిచేయడం మంచి పద్ధతి కాదని, పాలకవర్గం, ఉద్యోగులు, సభ్యులు ఐక్యంగా పనిచేస్తే ఆ సంస్థ అభివృద్ధి సాధిస్తుందన్నారు. చిత్తూరు ఏర్పాటు చేసిన కొత్త బ్రాంచ్ పట్ల అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఈ బ్యాంకు చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు.



ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న చైర్మన్ గంగరాజులు

'మహిళను హింసించిన దుర్మార్గులను శిక్షించాలి'

ప్రజాశక్తి- పలమనేరు: కర్నూలు జిల్లా, పెద్ద కడబూరు మండలం, కల్లుకుంట గ్రామంలో దళిత మహిళను విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డివి మునిరత్నం, మణి, పార్థసారథి డిమాండ్ చేశారు. అందులో భాగంగా శనివారం పలమనేరు పట్టణంలో జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో గుర్రం సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఈ విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, సుమతి మాట్లాడుతూ కల్లుకుంట గ్రామంలో దళిత యువకుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి అగ్రకుల పెత్తందారులు కన్నెర్ర చేసి అమ్మాయి కుటుంబీకులను రెచ్చగొట్టి దళిత మహిళపై దాడి చేయడమే కాకుండా కరెంటు స్తంభానికి తాళ్లతో కట్టేసి కొట్టడం దుర్మార్గమన్నారు. విషయం తెలుసుకున్న మండల పోలీసులు హుటాహుటిన గ్రామానికి వెళ్లి మహిళను, ఆమె రెండో కొడుకును కాపాడగలిగారని , లేకుంటే అగ్రకుల అహంకారులు తల్లి బిడ్డను చంపేసేవారని ఘాటుగా విమర్శించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన మానవత్వం లేని మృగాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, డిమాండ్ చేశారు. బాధితులను పోలీసులు కాపాడిన విధంగానే కేసు విచారణను కూడా నిష్పక్షపాతంగా, దుర్మార్గుల వెనుక రాజకీయ ప్రమేయం ఉన్న ఉపేక్షించకుండా దర్యాప్తు చేసి మూర్ఖులకు శిక్ష పడే విధంగా చూడాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక గాంధీ రోడ్డులోని లిటిల్ రోజ్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలు, ఆపరేషన్ల మెగా శిబిరం విజయవంత మైందని గ్లోబల్ స్పిర్చువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ బి గోపాలకృష్ణమూర్తి తెలిపారు. గత 12 సంవత్సరాలుగా చిత్తూరు జిల్లా పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ, గ్లోబల్ స్పిర్చువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వీటితో పాటు ఉమెన్ ఎంపవర్మెంట్, మెడికల్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, ఎడ్యుకేషన్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, డెంటల్ చెకప్ ప్రోగ్రామ్స్, ఫ్రీ ఐ చెక్ అప్ ప్రోగ్రామ్స్, ట్రీ ప్లాంటేషన్ లాంటివి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించా మన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి 365 రోజులు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నా మన్నారు. మొట్ట మొదట గ్లోబల్ స్పిర్చువల్ ట్రస్ట్, లిటిల్ రోజ్ హైస్కూల్, చిత్తూరు, బెంగళూరు లోని శంకర కంటి ఆస్పత్రి వారు సంయుక్తంగా కలిసి ఉచిత నేత్ర పరీక్షలు, ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాన్ని ఏర్పాటు చేసి అత్యంత విజయ వంతంగా నిర్వహించా మన్నారు. శంకర కంటి ఆస్పత్రి, బెంగళూరు నుండి డాక్టర్ దిష అగర్వాల్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ జి శివ ప్రసాద్‌తో సహ వారి సిబ్బంది పది మంది వచ్చారన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్య నిపుణులు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ఉనిసిగాని పల్లి గ్రామపంచాయతీలో టిడిపి నేతలు విజయవాడ వరద బాధితులకోసం విరాళం సేకరించారు. ఆదివారం ఉనిసిగాని పల్లి, గోవిందపల్లి, ఆనిగనూరు తదితర గ్రామాల్లో టిడిపి నేతలు పర్యటించి 1,0 1,116 రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందించనున్నట్లు తెలిపారు. మండలంలో ప్రతి ఒక్కరూ వరదల బాధితుల కోసం తోచినంత విరాళాలు అందించి విజయవాడ ప్రజల్ని అన్ని విధాల ఆదుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో క్ల స్టర్ ఇన్‌ఛార్జ్ రామ్మూర్తి , జిల్లా నేత జయశంకర్, శంకర్ చలం పాల్గొన్నారు.



విరాళాల సేకరిస్తున్న టిడిపి నాయకులు

లగడపాటి సాహితీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తెలుగు భాషా సాహిత్యాలకు తన రచనలతో ఇతరులకు ఆదర్శంగా నిలిచిన సాహితీ వేత్త లగడపాటి భాస్కర్ సేవలు చిరస్మరణీయమని పలువురు కవులు, రచయితలు కొనియాడారు. ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక- శ్రీకాళహస్తి అధ్యక్షులు, కవి, రచయిత లగడపాటి భాస్కర్ ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లగడపాటి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కవితల రూపంలో సాహితీ నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుమార్తెలు కిరణ్మయి, కృష్ణ శశిలు కవులు, రచయితలను సత్కరించారు. ఈసందర్భంగా లగడపాటి భాస్కర్ సంస్మరణ సంచికను జనవరిలో తీసుకురావడంతో పాటు, ప్రతి ఏటా లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారాలు ఇద్దరికీ అందించనున్నట్లు తీర్మానించారు. వేదిక ప్రతినిధులు గొడుగుచింత గోవిందయ్య, యువశ్రీ మురళి, తీగల వెంకటయ్య, గురునాథం, పెళ్ళకూరు మునిసుబ్బారెడ్డి, రవీంద్ర, మోహన్ నాయుడు, వెంకటస్వామి, చెంచుకృష్ణ పిళ్ళై,షన్ముగం, మునస్వామి, బాలముని శివకుమార్, లక్ష్మీనారాయణ, దేవ, సరస్వతి, భాస్కర్ పాల్గొన్నారు.

చెంగాలమ్మ సేవలో చాగంటి...

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని చాగంటి కోటేశ్వర రావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.శ్రీనివాస బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి అనంతరం పూజలు నిర్వహించారు. తదుపరి వేదపండితులచే ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు ఆకుతోట రమేష్, మన్నెముద్దు పద్మజ, ఐత శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, మన్నెముద్దు పద్మజ, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- తిరుమల:

తిరుపతిలోని ఒక ప్రముఖ ఫంక్షన్ హాల్లో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. తిరుమలలోని ఎస్వి హైస్కూల్లో 1996 -97 పదవ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత ఈనెల 15వ తేదీ ఆదివారం కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ క్షేమ సమాచారాలను పంచుకుంటూ ఎంతో సరదాగా ఆటపాటలతో గడిపారు. స్నేహితులందరితో కలిసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల పూర్వవిద్యార్థుల పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా కొంత నగదును అందులో జమ చేసుకుంటూ ఆ వచ్చిన డబ్బులతో స్నేహితుల కుటుంబాలలో ఎవరికైనా కష్టనష్టాలు సమయంలో వినియోగించు కోవాలని స్నేహితులందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు.



క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- పలువురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: పలమనేరు–చౌడేపల్లి రహదారిలో మండలంలోని దాసినంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం బొలెరో బోల్తా పడిన సంఘటనలో ఒకరు దుర్మరణం చెందగా పదిమందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు రాయలపేట సమీపంలో గల మార్లపల్లికి చెందిన మల్లికార్జున(40), రాజు(35),అప్పయ్య(60), రాము(35),గుర్రప్ప (65), లలిత (40), కాంతమ్మ (50), వెంకటమ్మ (45),నరేష్(27), కృష్ణ కుమార్ (25), దేవమ్మ (40), మణి (40), వెంకటరమణ (45) మరి కొంతమంది పలమనేరు సమీపంలోని కొలమాసనపల్లికి ఓ బోలోరో వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా, బైరెడ్డిపల్లి మండలం ధర్మపురి అగ్రహారానికి చెందిన ఎల్లప్ప కుమారుడు సుబ్రమణ్యం (55) ద్విచక్ర వాహనంపై అత్తగారి ఊరైన కూరగాయల కొత్తపల్లికి వెళ్లి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ నేపథ్యంలో దాసనంపల్లి సమీపంలోకి రాగానే బొలోరో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సుబ్రమణ్యం తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, బొలేరలో ప్రయాణిస్తున్న అందరూ తీవ్రంగా గాయపడ్డారు. విషయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, 108 వాహనం ద్వారా గాయపడిన వారిని పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -విజయపురం:

విజయపురం మండలం జంబాడ ఆదిఆంధ్రవాడకు చెందిన నాగరాజు (37) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు జంబాడ ఆది ఆంధ్రవాడకు చెందిన నాగరాజు తన భార్య, పిల్లలతో తిరుపతి ఆటోనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే తనకు స్వగ్రామం అయిన జంబాడలో ఓ మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకొని తరుచూ వస్తూ, పోతూ ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన స్వగ్రామైన జంబాడ సమీపంలో ఓ బ్రిడ్జి పక్కన గాయలతో పడి ఉండటం బస్సులో వెళుతున్న ఓ మహిళ చూసి స్థానికులకు తెలిపింది. వెంటనే అతని బంధువులు ప్రయివేటు వాహనంలో తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. తన భర్తను ఎవ్వరో చంపేశారని, భార్య విజయపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ గోవిందరాజులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పోలీసుల అదుపులో వున్న నిందితులు

యువకులపై దాడి కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

యువకులపై దాడి చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు. ఆదివారం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ శుక్రవారం చిత్తూరు నగరం సంతపేటకు చెందిన వసంత్ అనే యువకుడు తిరుపతిలో విధులు నిర్వహిస్తుండేవాడని , తన తల్లి చనిపోవడంతో 12వ రోజు కార్యానికి చిత్తూరుకు వచ్చి తన పక్కింటి వాళ్లతో కలిసి బైక్‌లో కట్టమంచి వినాయక నిమజ్జనాన్ని చూసుకొని చర్చి వీధిలోని అపూర్వ టెక్స్‌టైల్ వద్ద వస్తూ ఉండగా వెనక నుండి అరుణ్ అనే యువకుడు బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు ఘర్షణ పడ్డారు. కక్ష సాధింపుగా సంతపేట లిల్లీ బ్రిడ్జి వద్ద కాపుకాసి రాత్రి 11.30 గంటల సమయంలో అరుణ్ తన ఇద్దరు కొడుకులతో పాటు పని మనిషిని కలుపుకొని వసంత్ పై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వసంత్ కు 20 కుట్లు పడ్డాయి. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూ టౌన్ సీఐ నెట్టి కంటయ్య, ఎస్ఐ ప్రసాద్ తో కలిసి కేసు నమోదు చేసి నిందితులైన అరుణ్, యశ్వంత్, గిరీష్ జయరాం చిట్టిబాబు లను అరెస్ట్ చేయగా, ఇందులో ఒకరు మైనర్ కావడంతో నలుగురి పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశామని డిఎస్పి తెలిపారు.



ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

ఉరకలేసిన కోడెగిత్తలు

వెదురుకుప్పంలో జల్లికట్టు

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

మండలంలోని పూలవారి కండ్రికలో జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఆదివారం గ్రామస్తులు అందరూ కలిసి ఆ గ్రామాన్ని వేడుకగా ముస్తాబు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి , పక్క మండలాల నుంచి ఎక్కువ భాగం జల్లికట్టులో పాల్గొనే ఎద్దులతో అక్కడికి చేరుకున్నారు. గ్రామ నడివీధిలో అల్లిని నిర్వహించి అక్కడ పశువుల పండుగ నిర్వహించారు. బరిలో నిలవడానికి, కోడెగిత్తలను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. కొన్ని ఎద్దులను నిలువరించి వాటి కొమ్ములకు కట్టిన పట్టీలను సేజిక్కించుకొని ఆనందంతో పట్టీలను జనాల వైపు చూపించారు. పక్క మండలాల నుంచే కాకుం డా, తమిళనాడు నుంచి ఈ జల్లికట్టులో పోటీలో పాల్గొనేందుకు యువకులు వచ్చారు. గ్రామస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION): PALAMANER
O.S.No.3 of 2024

Between:
Canara Bank, ('e' Syndicate Bank), Gangavaram Branch, reptd. by its Branch Manager, Gangavaram ....Plaintiff

And :

1. Shaik Khaja,
2. A.Govinda Reddy, ...Defendants

NOTICE

To, 1. Shaik Khaja, S/o.S.Janu Saheb, residing at D.No.25-821, Rangapuram, New pet, Palamaner Town, Post and Mandal, Chittoor District.
2. A.Govinda Reddy, S/o.A.Rami Reddy, residing at D.No.5-6/2, Samarajapalle Village, Kallupalle Post, Gangavaram Mandal, Chittoor District.

Whereas the above suit filed by the plaintiff bank against you for recovery of the suit amount of Rs.2,41,537/- with further interest and costs is posted to 30.09.2024 for your notice. If you have any abjection, you can file the same in person or through your counsel on 30.09.2024 at 10.30 AM in the above case before this Hon'ble court, failing which the matter will be decided in your absence.

Sd/P.PARAMASIVAPPA, B.Com., LL.B., ADVOCATE FOR PLAINTIFF